దోమల నివారణకు తగిన చర్యలు


డ్రోన్ ద్వారా దోమలమందు స్ప్రేను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం సఫిల్‌గూడలేక్‌లో దోమల నివారణకు డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎంటమాలజీ విభాగంలో సిబ్బందితో పాటు ఫాగింగ్ యంత్రాలు తక్కువగా ఉన్నాయన్నారు. పలుమార్లు అధికారులు, మేయర్ దృష్టికి తీసుకొచ్చి, తగిన చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది, యంత్రాలతో కాలనీల్లో దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఈ వనజ, నందు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియను పునః ప్రారంభించాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

బోడుప్పల్: తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను పునః ప్రారంభించాలని ఫెడరేషన్ ప్రతినిధులు సోమవారం కమిషనర్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు. చెత్త డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, ప్రజలు రోగాల భారిన పడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో వర్మీకంపోస్టు, తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి సకాలంలో చెత్తను జవహర్‌నగర్‌కు తరలించేవారన్నారు. తిరిగి వర్మీ కంపోస్టును ప్రారంభించాలని, తడిచెత్త, పొడి చెత్తను పునః ప్రారంభించాలని వినతిపత్రంలో కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఫెడరేషన్ అధ్యక్షులు అబ్రహంలింకన్, కమిటీ సభ్యులు ఎల్లయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులున్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలి


కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న దృశ్యం

అల్వాల్: రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జేఏసీ (50 కాలనీలు) ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. మచ్చ బోల్లారంలో హిందూ శ్మశానవాటికను డంపింగ్‌యార్డుగా ఉపయోగిస్తున్నారని, దీనివల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీవాసుల ఆరోగ్యం దృష్ట్యా పరిశీలించి డంపింగ్ యార్డును తొలగించాలని నిరసన చేపట్టారు. ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి లేనందున మున్సిపల్ కార్యాలయంలో ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు ఉదయ్‌ప్రకాష్, శ్రీనివాస్, సుధాకర్, రాజశేఖర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, దయాసాగర్‌రావు, పరమేష్, అతిక్‌పాషా, పుష్ప, రాజేశ్వరి, జయలక్ష్మి, లక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు


ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు, అధ్యాపకులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో 'రెన్యూవబుల్ ఎనర్జీ రిసోర్సెస్' అంశంపై మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. చర్లపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని రింకీకుమారి ప్రథమ స్థానం, ఉప్పల్ ప్రియాభారతి హైస్కూల్ విద్యార్థిని అక్షర ద్వితీయ స్థానం, ఘట్‌కేసర్ ఎంజేపీటీ స్కూల్ విద్యార్థిని దీప్తి తృతీయ స్థానంలో నిలిచారని ఎంఈఓ సురేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు నేడు హాలియా ప్రభుత్వ పాఠశాలలో జరుగుతాయని, విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్

ఉప్పల్: ఉప్పల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. నిబంధనలు పాటించని వారికి చాక్లెట్లు అందిస్తూ.. అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి, ఇన్‌స్పెక్టర్ ఎల్లక్షన్‌రెడ్డి, డీఐ రామలింగారెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రెస్టారెంట్‌లో మంటలు.. తప్పిన ప్రమాదం

ఉప్పల్: ఉప్పల్ ప్రధాన రహదారిలో ఉన్న శ్రీ భాగ్య రెస్టారెంట్‌లో సోమవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు అంటుకున్న సమయంలో రెస్టారెంట్‌లో సిబ్బంది మినహా వినియోగదారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మేడిపల్లి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. వినాయకనగర్‌లో నివాసముంటున్న సైదులు (32)డ్రైవర్. కాగా సోమవారం మేడిపల్లిలోని ఏవిఇన్ ఫ్రోఫైడ్ పక్కన ఉన్న శివాలయానికి వెళ్లి ఆలయం పక్కనే ఉన్న ట్యాప్ వద్ద కాళ్లు కడుక్కుంటుండగా.. గచ్చుపై కాలుజారడంతో విద్యుత్ వైర్ తగిలి కొట్టుకుంటుండగా.. అక్కడే ఉన్న అయ్యప్ప మాలధారి లింగం గమనించి వెంటనే దగ్గరలో ఉన్న ప్లాస్టిక్ పైపు సాయంతో కరెంట్ తీగను కొట్టగా.. సైదులు కిందపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తుది దశకు సమగ్ర సర్వే !

పూర్తి కావస్తున్న డోర్ లాక్ ఇళ్ల సర్వే

- వలస కుటుంబాలు స్థానిక ప్రాంతం వైపు మొగ్గుతో ఇబ్బందులు
- పలు అవాంతరాలతో సర్వే చేపడుతున్న ఎన్యుమరేటర్లు
- దాదాపు పూర్తయిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ రూరల్ జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తుది దశకు చేరింది. గత నెల 9న ప్రారంభమైన సర్వే ఇప్పటి వరకు 99 శాతం పూర్తయింది. ఒకటి, రెండు రోజుల్లో మొత్తం పూర్తికానుంది. మొత్తంగా 2800 మంది ఎన్యుమరేటర్లు, 242 మంది పర్యవేక్షకులు 21 రోజులుగా సర్వే చేస్తున్నారు. వాస్తవానికి నవంబర్ నెలాఖరులోగా సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉన్నా ఎన్యుమరేటర్లు పలు అవాంతరాలు, డోర్ లాక్ వంటి పరిస్థితుల నేపథ్యంలో ఒకటి, రెండు రోజులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. సమగ్ర సర్వే ఇంకా కొనసాగుతున్నా సంబంధిత వివరాల(డాటా)ను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది.

- మేడ్చల్ రూరల్ జిల్లా పరిధిలోని ఐదు మండలాలు ,13 పురపాలక సంఘాల్లో సర్వే కార్యక్రమం చేపట్టగా, ఇప్పటి వరకు ఐదు మండలాలు, 6 మున్సిపాలిటీల్లో దాదాపు వంద శాతం సర్వే పూర్తయిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.
- జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లతోసహా పలు మున్సిపాలిటీల్లో సమగ్ర సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. డోర్ లాక్ ఇళ్లు ఉండటం వల్ల సర్వే చేయలేని పరిస్థితి నెలకొంది. వలస కుటుంబాల సంఖ్య కూడా అధికంగా ఉండటంతో వారంతా స్థానికంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకున్నామని దాట వేస్తున్నట్లు ఎన్యుమరేటర్లు పేర్కొంటున్నారు. దీంతో సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయలేకపోతున్నట్లు వివరించారు.

ప్రణాళికతో ముందుకు...

జిల్లా అధికార యంత్రాంగం సమగ్ర సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒక వైపు సమగ్ర సర్వే పనులు మరోవైపు ప్రభుత్వానికి సంబంధించిన ప్రాధాన్యత కార్యక్రమాలు ఉండటంతో కొంత ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. అయినా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లడంతో విజయవంతం అయ్యారు.

- సర్వేలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, జూనియర్ అసిస్టెంట్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ, మెప్మా సిబ్బందిసహా ఇతరులు కూడా భాగస్వామ్యం అయ్యారు. అయితే పల్లెల్లో సర్వేకు ప్రజల నుంచి పూర్తి సహకారం అందగా.. పురపాలికల్లో ఎన్యుమరేటర్లు కొంత ఇబ్బంది కర పరిస్థితులను ఎదుర్కొన్నారు.
- పట్టణ ప్రజలు వారి సొంతూళ్లలోనే సర్వే చేయించుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇక పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు సమగ్ర వివరాలు ఇవ్వలేదని తెలుస్తోంది.

55 శాతం పూర్తయిన నమోదు ప్రక్రియ...

ఒక వైపు సర్వే పనులు కొనసాగుతుండగానే మరోవైపు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 55 శాతం సర్వే వివరాలను నమోదు చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందుకోసం కంప్యూటర్లు అధికంగా ఉన్న కార్యాలయాల్లో ఆపరేటర్లను నియమించి వివరాలు నమోదు చేయిస్తున్నారు. సర్వే పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని జిల్లా అధికార యంత్రాంగం సూచనలు చేసింది.

వినియోగదారుల భద్రతే లక్ష్యం


ఉప్పల్‌లో నిర్వహించిన వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఉప్పల్: ఎల్‌పీజీ వినియోగదారుల భద్రతే తమ లక్ష్యమని, దాదాపుగా రూ.12 కోట్ల వినియోగదారులను కలిసే లక్ష్యంతో ఇంటింటి తనిఖీలు నిర్వహించినట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నోడల్ అధికారి నబీల్లా రెహమాన్ తెలిపారు. 'మన వంటగది మన భద్రత' అనే థీమ్‌తో సోమవారం ఉప్పల్ ఇండియన్ గ్యాస్ డీలర్ రమేష్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల సంయుక్తాధ్వర్యంలో గృహిణీలకు వంటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రూ.8 కోట్లమంది వినియోగదారుల ఇళ్లను తనిఖీ చేసి వారికి అవసరమైన తగ్గింపు ధరలకు గ్యాస్‌పైపును మార్చినట్లు వివరించారు. ఈ వంటల పోటీలు వినియోగదారులకు అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. పాతపైపులు, సురక్షితం కాని పైపులు వాడేవారు సురక్షితమైన పైపులను వాడుకోవాలని సూచించారు. అనంతరం న్యాయ నిర్ణేతలుగా వచ్చిన నోడల్ అధికారిని నబీల్లా రెహమాన్, తేజేశ్వర్‌రావులు సురక్షితంగా రుచికరమైన వంటలు వండిన వారిని గుర్తించి వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ఎస్ఎన్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, నాగార్జుననగర్ కాలనీలో కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పర్యటించారు. సోమవారం ఆమె సంక్షేమసంఘం ప్రతినిధులు, కాలనీవాసులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాగార్జుననగర్ కాలనీ బస్‌స్టాప్ వద్ద తరచుగా డ్రైనేజీ పొంగిపొర్లడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. చాలాకాలం క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్ సామర్థ్యం పెంచితే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. రోడ్డు నెంబర్-3 అధ్వానంగా ఉన్న రోడ్ల సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మెయిన్‌రోడ్డులో నిరుపయోగంగా ఉన్న జీహెచ్ఎంసీ మహిళా టాయిలెట్ క్యాబిన్‌ను తొలగించాలని కోరారు. ఈ అంశాలపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు యావపురం రవి, గోపాల్‌యాదవ్, సాయి, కరుణాకర్‌రెడ్డి, మహేష్‌గౌడ్, హిరాలాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా అధికారుల పర్యటన


చింతల చెరువు ప్రాంతంలో పర్యటించిన హైడ్రా అధికారులు

బోడుప్పల్: చెంగిచర్ల చింతల చెరువు బఫర్‌జోన్ ప్రాంతాన్ని హైడ్రా అధికారులు పర్యటించారు. ఓ మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని ఇటీవల బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా టీమ్ అడిషనల్ కలెక్టర్ సుధా, టీమ్ సభ్యులు హేమ, విజయకుమార్ పర్యటించారు. గతంలో 4.12 ఎకరాల స్థలంలో లేఅవుట్ చేసి విక్రయించారని, ప్రస్తుతం నిర్మిస్తున్న భవనం ప్రభుత్వ స్థలం పరిధిలో ఉన్నాయన్నారు. హైడ్రా అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. మేడిపల్లి తహసీల్దార్ హసీనా, బోడుప్పల్ టీపీఎస్ కావ్య, ఇరిగేషన్ ఏఈ పరమేష్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

అల్వాల్: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అల్వాల్ భూదేవినగర్‌లో నివాసం ఉండే కీర్తి (23) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కాగా ఆమెకు రెండేళ్ల క్రితం సామ్రాట్ అనే వ్యక్తితో వివాహమైంది. వీరిమధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయని సమాచారం. ఆదివారం రాత్రి అత్తవారింట్లో కీర్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు లోతుకుంటలో గ్రామసభ

అల్వాల్: సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే రాజీవ్ రహదారిలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ కోసం భూ సేకరణ ప్రక్రియలో భాగంగా అల్వాల్‌లో మంగళవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు అల్వాల్ మండల తహసీల్దార్ రాములు తెలిపారు. రాజీవ్ రహదారి లోతుకుంట అల్వాల్ ప్రాంతాల్లో రోడ్డు పక్కన గల వాణిజ్య, నివాస గృహాలను కోల్పోతున్న యజమానులు మంగళవారం ఉదయం 8 గంటలకు అల్వాల్‌లోని సిద్ధార్థ వినయ విద్యానికేతన్ ఐటీఐ కళాశాలలో నిర్వహించనున్న గ్రామసభకు హాజరు కావాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్



అల్వాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన వారోత్సవాలు అల్వాల్ సర్కిల్‌లో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా 134 డివిజన్ జేజేనగర్‌లో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది చిత్తారి వెంకటేష్, వెంకట్రామిరెడ్డి, విష్ణు, స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ


బాధితుడికి ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్, దీన్‌దయాల్‌నగర్ కాలనీకి చెందిన ఇందిరాభాయ్ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకోగా.. సోమవారం మంజూరైన రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బోయిన్‌పల్లి క్యాంప్ ఆఫీసులో లబ్ధిదారులకు అందజేశారు. రావుల అంజయ్య, డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్, డివిజన్ కార్యదర్శి బాలకృష్ణగుప్తా, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


జేసీబీ సాయంతో కూల్చివేయిస్తున్న దృశ్యం

బోడుప్పల్: బోడుప్పల్‌లోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను సోమవారం మేడిపల్లి రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి తహసీల్దార్ హసీనా మాట్లాడుతూ.. సర్వేనంబర్ 63/1నుంచి 63/25 ఎస్సీల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రెండు ఇళ్లు, రెండు బేస్‌మెంట్స్ నిర్మించగా.. వాటిని జేసీబీతో కూల్చివేసినట్లు వివరించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, సిబ్బంది కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం


సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 3వ డివిజన్ పరిధిలో సోమవారం సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజాపాలనలో భాగంగా 1,3వ డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ బి– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్ మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుల ఆటకట్టు !

రామంతాపూర్: తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌కు వచ్చిన ఫిర్యాదుల మేరకు కౌన్సిల్ మెంబర్ పీఆర్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్‌కుమార్, వేములపల్లి ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో వైద్య విద్యను అభ్యసించకుండానే ఎలాంటి వైద్య, విద్యార్హతలు లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్న నకిలీ ఆర్ఎంపీ, పీఎంపీ పేరిట నిర్వహిస్తున్న ఆసుపత్రులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. రామంతాపూర్, నెహ్రూనగర్‌లోని ఎస్వీఎల్ క్లినిక్ పేరిట డాక్టర్ నరసింహాచారి, ఎంబీబీఎస్ పేరు మీద అనుమతి తీసుకుని నకిలీ వైద్యుడు అవంచ సురేష్ వైద్యుడినని చెప్పుకుంటూ వైద్యపరంగా ఎలాంటి విద్యార్హతలు లేకుండా చికిత్స చేస్తున్నట్లు తాము గుర్తించామని, నిబంధనల ప్రకారం అతడికి నోటీసు ఇవ్వడంతో పాటు నకిలీ వైద్యుడు సురేష్‌పై కేసు నమోదు చేయిస్తామని తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన శ్రీ బాలాజీ ఫస్ట్ ఎయిడ్ నిర్వాహకుడు నాగేశ్వర్‌రావు నొప్పి నివారణ ఇంజక్షన్లతో పాటు ఇతర మందులను చట్ట విరుద్ధంగా పేషంట్లకు ఇస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. స్థానిక రామ్‌రెడ్డినగర్ రామంతాపూర్ ఆర్ఎంపీ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా చలామణి అవుతున్న ఉషోదయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు యాదగిరి డాక్టర్ అని చెబుతూ..డిస్టిల్ వాటర్ వైల్స్‌ను వందల సంఖ్యలో నిల్వ ఉంచి వాటిని సూది మందులుగా ఇస్తున్నట్లు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉప్పల్ బీరప్పగడ్డ నకిలీ వైద్యుడు బీబీ శ్రీనుపై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఈ నకిలీ డాక్టర్ల వివరాలను డ్రగ్ కంట్రోల్ కమిషనర్ కమలహాసన్‌రెడ్డికి ఫిర్యాదు చేశామని, వారు సత్వరమే స్పందించి చర్యలు తీసుకుంటున్నారని డాక్టర్ నరేష్ కుమార్ వివరించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజల ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లాలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, నూతన పారామెడికల్ కోర్సులను సీఎం రేవంత్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కోర్సులు యువతకు ఎంతగానో ఉపయోగకరమన్నారు. సోమవారం ఈసీఐఎల్‌లో కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజానికి అధునాతన ఆరోగ్య సేవలను అందించడంలో నర్సింగ్ కళాశాల ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరించారు. నర్సింగ్ విద్యార్థులు వారి భవిష్యత్తు కోసమే కాకుండా, సమాజానికి సేవ చేసేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) రాధికాగుప్తా, డీఎంహెచ్ఓ డాక్టర్. రఘునాథస్వామి, జిల్లా ఉప వైద్యాధికారి డా. శోభారాణి, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.వంశీకృష్ణ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సంపూర్ణ, వైస్ ప్రిన్సిపాల్ డి. జయంతి తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ

మల్కాజిగిరి: నిబద్ధతతో పనిచేసి గుర్తింపు తీసుకునిరావాలని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి కానిస్టేబుళ్లకు సూచించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్స్ కీర్తి, లయనీదేవి, సాయికిరణ్‌రెడ్డి, లింగయ్య, లింగస్వామి, ఉదయ్‌కుమార్, యశ్వంత్‌సాయి, వినయ్‌గౌడ్, మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు.

మీతో సాక్షి కి విశేష స్పందన

సాక్షి ఎఫెక్ట్..


జలమండలి జీఎంలతో ఎమ్మెల్యే మర్రి, కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: ఎట్టకేలకు 'మీతో సాక్షి' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గత నెల 30న 'నీళ్లు రావు.. వసతులు లేవు'.. కార్యక్రమాన్ని సాక్షి మీతో కార్యక్రమం నిర్వహించింది. స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌లు సోమవారం మల్కాజిగిరి జలమండలి, సికింద్రాబాద్ జలమండలి సీఎంలతో సమన్వయం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్, బీహెచ్‌ఈఎల్‌బస్తీ, రామాంజనేయనగర్, హిల్‌టాప్‌కాలనీ, జేఎల్ఎన్ఎస్‌నగర్, న్యూ వేంకటేశ్వరనగర్ తదితర ప్రాంతాల్లో నెలకొన్న నీటి సమస్యలను పరిష్కరించాలని వారికి వినతిపత్రం అందజేశారు. గతంలో తాగునీటి సరఫరా రోజు విడిచి రోజు 2 గంటల పాటు ఉండేదని. ఇప్పుడు వారానికోసారి నీటి సరఫరా అవుతోందని జలమండలి జీఎంలకు వివరించారు. నీటి కొరత ఉన్న కాలనీలకు తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. నాయకులు మేకల రాముయాదవ్, స్థానిక నేతలు తదితరులున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా


కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు


ఉప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు, మహిళలు

ఉప్పల్: ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డి ఆరోపించారు. ' ఇందిరమ్మ రాజ్యంలో తెల్లరేషన్ కార్డులు ఎప్పుడిస్తారో' అనే నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ చౌరస్తా నుంచి సివిల్ సప్లై కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. 6 గ్యారంటీలు 66 మోసాలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని ఆరోపణలు చేశారు. అనంతరం కార్యాలయం ఎదుట పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు, రేషన్ కార్డులకు దరఖాస్తుదారులు భారీ ఎత్తున మద్దతు పలికారు. ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటూ అర్హులైన నిరుపేదలకు రేషన్‌కార్డులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. పేదల ప్రభుత్వం అంటూనే మరో పక్క పేదల నడ్డి విరిచే విధానాలతో సామాన్యులను అనేక ఇబ్బందులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ఎండగట్టారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణి, శ్రీనివాస్, శిల్పారెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఫణిందర్, రాజు, యాదగిరి పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ..

అల్వాల్: కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ 136 డివిజన్ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ బాబు ఆధ్వర్యంలో 'మారింది పాలకులే పాలన కాదు, మార్పు రాలే బతుకు మారలే' అనే కరపత్రాతాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు గీతామూర్తి, ధనలక్ష్మి, రమణారెడ్డి, సుధాకర్, శర్మ, రాజారెడ్డి, నవీన్, నాగరాజు, విజయలక్ష్మి, శ్రీదేవి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.